తెలుగు కళానమితి (న్యూసెర్సీ) వారి 1986 మినీకథల పోటీలో
రు.250/-లు బహుమతి పొందిన కథ.

# కిటుకు

సరస్వతి అని పేరుపెడితే చదువులు రాకపోవచ్చు. పద్మాక్షికి మెల్ల కన్నుండవచ్చు. లలిత అనంటే మొరటుగా వుండొచ్చు. కాని పాతికేళ్ళ సన్నమ్మ నిజంగా సన్నమ్మే! సన్నంగానూ, నాజూకు గానూ వుంటుంది. సన్నమ్మ తండ్రి పౌరాణికుడు. దేవాలయాలలో పురాణ కాలక్షేపం చేస్తూ కాలం వెళ్ళబుచ్చుతూంటాడు.

సన్నమ్మకి తల్లిలేదు. ఏకైక పుత్రిక. తండ్రికి తానే వంటచేసి పెడుతుంది. యుక్తవయస్సులో వున్న కుమార్తెకి పెళ్ళి చేద్దామనే తహతహ ఏ తండ్రికైనా వుంటుంది. అలాగే సన్నమ్మ తండ్రికీని. కాని ఆర్థిక పుష్టి చాలదు. కట్నం మాట దేవుడెరుగు, కనీసం ఒక్కపూటైనా పప్పు అన్నం పెట్టలేనివాడు.

తండ్రి ఏ దేవాలయంలో పురాణం చెప్పినా అందరితోపాటు తనుకూడా వినేది. పౌరాణిక గాథల్లో సన్నమ్మని అతిగా ఆకట్టుకున్నది గజేంద్ర మోక్షము. "లా వొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యే" అన్న భక్తపోతన్న పద్యం అంటే సన్నమ్మ తన్మయత్వం చెందిపోతుంది. మొరపెట్టగా పెట్టగా, మహావిష్ణువు గజేంద్రుణ్ణి రక్షించినట్టే తనను కూడా రక్షిస్తాడని సన్నమ్మ నమ్మకం. గజేంద్రుడు ఆపదలో వున్నట్టు సన్నమ్మ ఆపదలో వుందా అంటే - వుంది. తండ్రి చూస్తే ఒక పేద పౌరాణికుడు. నేడో రేపో వృద్ధాప్యం చేత కాలం చెయ్యొచ్చు.

మధ్యాహ్నల వేళ ఇంటి దగ్గర గజేంద్రమోక్షం కథా పద్యాలను సన్నమ్మ భక్తి పారవశ్యంలో చదువుతూంటే ఆ వీధిలో వున్న అమ్మలక్కలందరూ విని

తన్మయత్వం చెందేవారు.

కొన్నివేల సంవత్సరాలు గడిచేక గజేంద్రుణ్ణి విష్ణువు కరుణించినట్టు కాక, కలియుగ కాలమానం ప్రకారం పదిహేనేళ్ళలోనే కనికరించేడు కనకచేలుడు. ఇప్పుడు సన్నమ్మకి నలభై దాటేయి.

మదరాసులో మంచి ఆఫీసరు హోదాలో వున్న 45-50 ఏళ్ళ మధ్య వయస్కుడికి భార్య చనిపోయింది. ఇంట్లో నలలునివంటి పాకశాస్త్ర ప్రవీణుడున్నాడు. అతన్ని పెళ్ళి చేసుకుంటావా అని ఓ మధ్యవర్తి అడిగిందే తడవుగా, సన్నమ్మ అంగీకరించింది. రెండో పెళ్ళివాడు అయితే అయేడు, రెండు పూటలా కడుపునిండా ఇంత అన్నం పడేస్తాడు కదా అని సన్నమ్మ ధీమా. అదే ఆమె జీవిత బీమా!

✿ ✿ ✿

ఇప్పుడు సన్నమ్మ మదరాసు నివాసిని. ఆదర్శ గృహిణి. బొజ్జనిండా బువ్వ. కావలసినప్పుడల్లా టిఫిన్లు. ఇంట్లో కాల్ గాస్ స్టౌ. ప్రెషర్ కుకర్. రేడియో వీడియో. ఒక్క ఏసీ తప్ప సమస్త ఆధునిక సౌకర్యాలు ఇంట్లో వున్నాయి. రోజూ సాయంత్రం వేళ వాళ్ళాయన స్కూటర్ మీద వాహ్యాళి తీసుకెళతాడు. ఇహ సినిమాలు, ఎగ్జిబిషన్లు, షాపింగ్ సన్నమ్మ ఎప్పుడు కోరుకుంటే అప్పుడే!

ఈనాడు సన్నమ్మకి చీకూ చింతాలేదు. తనివి. అన్నింటినీ మించిన తృప్తి. సమాజంలో తనకొక గౌరవస్థానం. భర్త అండదండలు.

ఇప్పుడు 'సన్న'మ్మ కాదు. 'లావ'మ్మ. మానసిక సౌఖ్యమే అందుక్కారణం. కాటాలో వెయ్యకుండానే రెండొందల కేజీలుంటుందని ఎవరైనా ఊహించవచ్చు. మిగిలిన శరీరమూ, శీర్షమూ కలిసిపోయేయి. మెడ అస్సలు కనబడ్డం లేదు!

మూడేళ్ళు గడిచేక సన్నమ్మకి చెందిన గ్రామంలోని అమ్మలక్కలు కొందరు రైల్వే సర్క్యులర్ టిక్కెట్స్ తీసుకుని యాత్రలు చేస్తూ మదరాసు చేరుకున్నారు. మన సన్నమ్మ ఎలా వుందో అని తలుపు తోట్టేరు.

"నేనే సన్నమ్మని పిన్నీ!" అని సన్నమ్మ స్వయంగా చెప్పేవరకూ అమ్మలక్కలు నమ్మలేకపోయారు.

"అయ్యో! ఎంతలా చిక్కిపోయేవే సన్నమ్మా!" అని ముక్కుల మీద వేళ్ళేసుకున్నారు అమ్మలక్కలు; లావెక్కేవంటే దిష్టి తగుల్తుందనుకుంటుందేమో

అని.

సన్నమ్మ వాళ్ళకి ఇల్లంతా చూపించింది.

సన్నమ్మకి గల అత్యాధునిక సౌకర్యాలకు ముగ్ధులై పోయేరు అమ్మలక్కలు. వారికి ప్రియాతిప్రియమైన పిండివంటలు - అరిసెలు, మినప సున్నుండలు, జంతికలు, చేగోడీలు, చక్కిలాలు, పాలకాయలు వంటవాడిచేత చేయించింది సన్నమ్మ. "ఎంతదృష్టవంతురాలివే తల్లీ!" అని అమ్మలక్కలు ముచ్చటపడి పోయారు.

"సన్నమ్మా! నువ్వు గజేంద్ర మోక్షం అనునిత్యమూ వినిపిస్తూ, తన్మయత్వం చెందుతూ మమ్మల్ని భక్తిపారవశ్యంలో ముంచేదానివి. ఏదీ మరొక్క సారి, నీ నోటిద్వారా ఆ కథని మాకు వినిపించవే అమ్మా!" అన్నారు అమ్మలక్కలు.

"నాకిప్పుడు ఆ పురాణాలు చదవడానికి ఓపికా, తీరికా ఎక్కడివర్రా? నన్ను మరి చంపకండి!" అంది సన్నమ్మ ఆవలిస్తూ చిటికెలు వేస్తూ-

అసలు కిటుకు ఏమిటంటే, సన్నమ్మ విపరీతంగా లావెక్కింది. గజేంద్రమోక్షంలోని 'లా వొక్కింతయు లేదు..." అనే పద్యాన్ని ఏ మొహంతో చదువుతుంది?

• ఆంధ్రజ్యోతి వీక్లీ •
*30-5-1986*